ఇంటర్‌లో ద్వితీయ భాషగా సంస్కృతం వద్దు

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్‌లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలనే ఇంటర్ బోర్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని తేవాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు. రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయనీ, వాటిలో సుమారు లక్షన్నరకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు తెలుగు, హిందీ ద్వితీయ భాషగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇప్పుడు సంస్కృతాన్ని తీసుకుని రావడం వల్ల సరైన బోధనా సిబ్బంది లేక విద్యార్థులు నష్టపోయే అవకాశముందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి చేస్తూ 2018లో చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. ఇంటర్‌లో సంస్కృతాన్ని తేవటం వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ద్వితీయ భాషగా సంస్కృతాన్ని తేవాలన్న ఇంటర్ బోర్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ వారు డిమాండ్ చేశారు.

అవార్డు అందుకుంటున్న యాదగిరి

జర్నలిస్ట్ యాదగిరికి అల్లూరి అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ పరకాల యాదగిరిని అల్లూరి సీతారామరాజు స్మారక అవార్డు వరించింది. నవభారత్ నిర్మాణ సంఘం - పాలడుగు నాగయ్య కళాపీఠం సంయుక్తంగా యాదగిరిని ఈ అవార్డుకు ఎంపిక చేశాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్ నర్సింహరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును యాదగిరికి అందజేశారు. శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతోపాటు రూ.5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత వైమానిక దళ రిటైర్డ్ మేజర్ జనరల్ ఎం.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొనగా, సామాజికవేత్త డాక్టర్ ఎన్.కరుణాకర్‌రెడ్డి, ప్రముఖ కవి విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి, నవభారత నిర్మాణ సంఘం అధ్యక్షులు సూరేపల్లి రవికుమార్, కళాపీఠం అధ్యక్షురాలు పాలడుగు సరోజిని తదితరులు హాజరయ్యారు. అల్లూరి అవార్డు రావడం సంతోషంగా ఉందని జర్నలిస్టు యాదగిరి అభిప్రాయపడ్డారు. దీంతో బాధ్యతను పెరిగినట్టయిందని చెప్పారు.

వనజీవి విషాద గీతం

- నిద్రలోనే కన్నుమూసిన రామయ్య
- ప్రధానితో సహా పలువురు సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆకులో ఆకై.. మొక్కల్లో మొక్కై.. చెట్లలో చెట్టై.. పచ్చని ప్రకృతై.. పర్యావరణ హితుడై.. ప్రాణవాయువుకు ఆయువై.. కోటికి పైగా మొక్కలు నాటి ప్రాణి కోటికి ప్రాణప్రదమైన వనజీవి రామయ్య అలియాస్ దరిపల్లి రామయ్య (85) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. రాత్రి నిద్రించిన ఆయన ఉదయం విగత జీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆర్‌ఎంపికి చూపించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కొంతకాలంగా రామయ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కోటికిపైగా మొక్కలు నాటి వనజీవి రామయ్య, జానకమ్మ దంపతులు చరిత్ర సృష్టించారు.

పశువుల కాపరి నుంచి పద్మశ్రీ వరకు..

ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం గ్రామంలో రామయ్య ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేక పశువుల కాపరిగా మారారు. 1967లో జానమ్మ (జానకమ్మ)ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కుమార్తె సైదమ్మ ఉన్నారు. ఇద్దరు కుమారులు సైదులు, సత్యనారాయణ ఇప్పటికే అనారోగ్యంతో మృతిచెందారు. వీరిది పేద కుటుంబం. దరిపల్లి రామయ్య కుటుంబానికి గతంలో ఏడు ఎకరాల భూమి ఉండేది. మొక్కలు నాటేందుకు ఖర్చుల కోసం మూడెకరాల భూమి అమ్మాడు. పుస్తకాల్లో అశోక చక్రవర్తి గురించి చదివిన రామయ్య.. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని రహదారులకిరువైపులా మొక్కలు నాటడం ప్రారంభించారు. ఇలా కోటికి పైగా మొక్కలు నాటారు. దరిపల్లి రామయ్య కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017 మార్చి 30వ తేదీన పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా వనజీవి రామయ్య అవార్డు అందుకున్నారు.

అవార్డులు..

2013 ఏప్రిల్ 8వ తేదీన బెంగళూరుకు చెందిన అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే సంస్థ రామయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసింది. తరువాత నాటి ప్రధాని పివి నరసింహారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, వైఎస్.రాజశేఖరరెడ్డి, రోశయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, నాటి గవర్నర్ సుశీల్ కుమార్ షిండే చేతుల మీదుగా ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న తరువాత ఎంతో మంది ప్రముఖుల నుంచి సన్మానాలు, ప్రశంసలు దక్కించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంతో మంది అధికారులు సన్మానాలు చేశారు.

'వృక్షో రక్షిత రక్షణ' నినాదంతో..

వృక్షో రక్షిత రక్షణ' అనే నినాదాన్ని రామయ్య, జానకమ్మ దంపతులు తమ తలపాగాగా ధరించి పర్యావరణ హితం కోసం పాటుపడ్డారు. మొక్కలు నాటాలని విస్తృతంగా ప్రచారం చేశారు. 2000లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన టివిఎస్ వాహనంపై తిరుగుతూ మొక్కలు నాటేవారు. పెట్రోల్‌కు నెలకు రూ.1500 ప్రభుత్వం తరపున ఇచ్చేవారు. తర్వాత ప్రభుత్వం మారి తనకు డబ్బులు ఇచ్చేవారు లేకపోయినా సైకిల్‌పై సాధ్యమైనంత వరకు ప్రచారం చేసేవారు.

తెలుగులో ప్రధాని మోడీ ట్వీట్

వనజీవి రామయ్య లక్షలాది మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి తన జీవితాన్ని అంకితమిచ్చారని ప్రధాని నరేంద్ర మోడీ తెలుగులో ట్వీట్ చేశారు. 'ఆయన అవిశ్రాంత కృషి ప్రకృతిపై గాఢమైన ప్రేమను, భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయి. ఆయన చేసిన కృషి యువతలో హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని ప్రధాని ట్వీట్ చేశారు.

పర్యావరణ ఉద్యమానికి లోటు: సిఎంలు చంద్రబాబు, రేవంత్

పర్యావరణ పరిరక్షణకు కోటి మొక్కలు నాటిన రామయ్య కృషి స్ఫూర్తిదాయకం. ఒక వ్యక్తిగా మొక్కలు నాటడం ప్రారంభించి మొత్తం సమాజాన్ని ప్రభావితం చేశారు. రామయ్య మృతి సమాజానికి తీరని లోటు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇంటి పేరును వనజీవిగా మార్చుకుని పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన రామయ్య మృతి చెందారని తెలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

పర్యావరణ యోధుడు: నారా లోకేష్

వృక్షో రక్షతి రక్షిత్ణ" అన్న రామయ్య జీవన సందేశమే ఆయన జీవిత సారాంశం. ఆయన చూపించిన మార్గం ఎన్నో తరాలకు ప్రేరణగా నిలుస్తుంది. మనందరం ఆయన చూపించిన మార్గాన్ని అనుసరిస్తేనే రామయ్యకు నిజమైన నివాళి అవుతుంది.

రామయ్య మృతి దేశానికి లోటు

పద్మశ్రీ అవార్డు గ్రహిత దరిపల్లి రామయ్య మృతి రాష్ట్రానికి, దేశానికి తీరని లోటు అని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యావరణ హితం కోసం కోటి మొక్కలు నాటి ఇంటి పేరునే వనజీవిగా మార్చుకున్న ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్య అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

ప్రచార జాతాలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

చదువులో అంతరాలు పోవాలి

- పిల్లలను ప్రభుత్వ బడులకే పంపాలి
- తెలంగాణ పౌరస్పందన వేదిక అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చదువులో అంతరాలు పోవాలి.. ప్రభుత్వ బడులు నిలబడాలని, ప్రభుత్వ బడుల ద్వారానే సామాజిక అంతరాలు తొలగిపోతాయని తెలంగాణ పౌరస్పందన వేదిక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత అనే నినాదంతో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. విద్యార్థుల మధ్య చదువులో అంతరాలు తొలగిపోవాలంటే ప్రభుత్వ బడులు నిలబడాలన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల మధ్య తారతమ్యాన్ని సృష్టిస్తున్నారని, అది విద్యాలోకానికి తీవ్ర అన్యాయమని, విద్యార్థుల మధ్య భేదాభిప్రాయాలను సృష్టిస్తుందని చెప్పారు. రానురానూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 18.4 శాతం, హైదరాబాద్ జిల్లాలో 22.9 శాతం, రంగారెడ్డి జిల్లాలో 29.4 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, మెజారిటీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేటట్టు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ (ఎల్‌కెజి, యుకెజి) తరగతులు ప్రారంభించడానికి అవసరమైన గదుల నిర్మాణానికి, ఉపాధ్యాయుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా అదనపు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు తెలంగాణ ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలన్నింటిలో ప్రీ-ప్రైమరీ తరగతులు జూన్ 2026లోగా ప్రారంభించాలని కోరారు. తరగతికొక గది, టీచర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడిన నివాస ప్రాంతాల్లో ప్రభుత్వ బడులు పెట్టాలని, మధ్యాహ్న భోజనాన్ని ఆయా బడుల్లోనే ఏజెన్సీల ద్వారా వండించాలని అన్నారు. విద్యా పరిపాలన వ్యవస్థలో బడుల సంఖ్య, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఈఓ, డిప్యూటీ ఈఓ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులను అభివవృద్ధి చేయాలని కోరుకునే విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలు, బస్తీ కమిటీలు తెలంగాణ పౌర స్పందన వేదికతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు కె.మంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, ధనమూర్తి లక్ష్మణరావు, నాగమణి, రాములు, ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ప్రశాంత్ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదవులున్నా.. లేకున్నా ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ.. ప్రభుత్వాలపై అధికారులపై ఒత్తిడి తెచ్చేది ఎర్రజెండా ఒక్కటేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ఈదులూరు గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో 'సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం' కోసం చేపట్టిన ప్రజాపోరుబాట పాదయాత్రను శనివారం ప్రారంభించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్టంగూర్ మండలం సమగ్ర అభివృద్ధి కావాలన్న లక్ష్యంతో సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. మూసీ ప్రాజెక్టు ద్వారా, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు ద్వారా, కాలువల ద్వారా మండలంలో సుమారు 30 వేల ఎకరాలకు నీరందే అవకాశం ఉందని వివరించారు. మండలంలో సాగు తాగునీటి వనరులను పూర్తి చేసి నీరందించేందుకు కృషి చేయాలన్నారు. రైతులందరికీ రుణమాఫీ కాలేదని, పెట్టుబడి సాయం లేక ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సన్న రకం, దొడ్డు రకం అని చూడకుండా రైతులు పండించిన ప్రతి పంటకూ బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు ఎక్కువయ్యాయని చెప్పారు. సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. పాదయాత్ర బృందం సభ్యులను మెచ్చుకున్నారు. మండుటెండను లెక్కచేయకుండా పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

పాదయాత్రను ప్రారంభిస్తున్న జూలకంటి రంగారెడ్డి

బర్త్ రైట్ బై రెయిన్‌బోలో అరుదైన ప్రసూతి శస్త్ర చికిత్స

హైదరాబాద్ : నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని బర్త్ రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్‌లోని నిపుణుల బృందం అసాధారణమైన అరుదైన, సంక్లిష్టమైన గర్భధారణ చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ప్లాసెంటా పెర్క్రెటా, తక్కువ రక్తనష్టం, రక్తమార్పిడి లేకుండా సురక్షితమైన డెలివరీని సాధించినట్లు వెల్లడించాయి. ఇలాంటి అత్యంత ప్రమాదకర సంక్లిష్టమైన గర్భధారణల కేసు విజయవంతమడంతో మరోసారి తమ హాస్పిటల్ ఖ్యాతిని రుజువు చేసిందని రెయిన్‌బో హాస్పిటల్స్‌లోని కన్సల్టెంట్ ప్రసూతి వైద్యులు డాక్టర్ హిమాబిందు పేర్కొన్నారు. " 26 ఏళ్ల మహిళ అయిన రోగికి అరుదైన ప్లాసెంటా పెర్క్రెటా ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇక్కడ ప్లాసెంటా అసాధారణంగా గర్భాశయ గోడకు అంటుకుని దాని ద్వారా చొచ్చుకుపోతుంది. మూత్రాశయం లేదా ప్రేగు వంటి సమీపంలోని అవయవాలపై ఇది దాడి చేస్తుంది. ఇటువంటి అధిక-ప్రమాదకర ప్రసూతి శస్త్రచికిత్స సవాలుతో కూడుకున్నది మాత్రమే కాదు. ఎంతో జాగ్రత్త, ప్రణాళిక కూడా అవసరం " అని డాక్టర్ హిమబిందు వివరించారు.

హైదరాబాద్‌కు అవిరా డైమండ్ విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ : ల్యాబ్‌లో డైమండ్ జ్యువెలరీని ఉత్పత్తి చేసే అవిరా డైమండ్స్ తాజాగా తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించింది. నగరంలో తన మొదటి ఎక్స్‌క్లూజివ్ బుటిక్ స్టోర్‌ను మాదాపూర్‌లో ఏర్పాటు చేసింది. ఈ స్టోర్‌ను శనివారం ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎండి సురేష్ జైన్ లాంఛనంగా ప్రారంభించారు. ఇది తమకు ఎనిమిదో స్టోర్ అన్నారు. చెన్నై, బెంగళూరు, పుదుచ్చేరి, దుబాయ్‌లో కార్యకలాపాలను కలిగి ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 10 స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్ ఫ్రాంచేజీ భాగస్వాములు శిల్పారెడ్డి కొల్లా, కొల్లా అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో తాగునీరు, ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయండి

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ దవాఖానాల్లో తాగు నీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు, బాధితులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో ఆస్పత్రుల్లోని ఎదురయ్యే సౌకర్యాలపై ఉన్నతాధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, వారి అటెండెంట్లకు, సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పెద్ద ఆస్పత్రుల్లో ప్రతి బ్లాక్‌లో, ఫ్లోర్‌లో తాగు నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతోందనీ, ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ఐసియులు, అవసరమైన ఇతర వార్డుల్లో ఎసిలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాన్లు, ఎసిలు, కూలర్లు రిపేర్ ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలన్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుందని అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. అన్ని ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందనీ, ఈ నేపథ్యంలో కరెంటు కేబుళ్లను వెంటనే చెక్ చేయించాలని ఆదేశించారు. అవసరమైన చోట పాత వైర్ల స్థానంలో, కొత్త వైరింగ్ చేయించాలని సూచించారు. హాస్పిటళ్ల లోపల, బయట గుట్కా నమలడం, పొగతాగడం, మందు సేవించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని ఆదేశించారు. ప్రతీ ఆస్పత్రిలో ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ ఉన్నాయా? లేవా? అనేది పరిశీలించాలన్నారు. అగ్నిమాపక అధికారులతో, ఆస్పత్రి అధికారులు సమన్వయం చేసుకోవాలనీ, ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఏడాది ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారనీ, వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

కీర్తిలాల్స్ 'లస్టర్ అండ్ లెగసీ' సిరీస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ కీర్తిలాల్స్ కొత్తగా 'లస్టర్ అండ్ లెగసీ' సిరీస్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపింది. 25 ఏళ్ల తన ఉనికికి గుర్తుగా వీటిని సోమాజీగూడ షోరూంలో ఆవిష్కరించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ తెలిపారు. ఈ మైలు రాయికి గుర్తుగా వజ్రాభరణాలపై కేరట్‌కు రూ.20 వేల వరకూ ప్రత్యేకమైన తగ్గింపును అందిస్తున్నామన్నారు. వజ్రాల కొనుగోళ్ళలో పూర్తి పారదర్శకతని, ప్రామాణికతని హామీ ఇస్తున్నామన్నారు.

కొంపల్లిలో జావా యెజ్డి డీలర్‌షిప్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలో తమ అతిపెద్ద మోటర్ సైకిల్స్ డీలర్‌షిప్‌ను కొంపల్లిలో ప్రారంభించినట్లు జావా యెజ్డి, బిఎస్‌ఎ సంస్థలు తెలిపాయి. ఇక్కడ విస్తృత శ్రేణి మోటర్‌సైకిళ్లు, ప్రీమియం సేవల అనుభవం, అసమానమైన కస్టమర్ అనుభవాన్ని అందించనున్నట్లు క్లాసిక్ లెజెండ్స్ సిబిఒ శరద్ అగర్వాల్ తెలిపారు. ఇది నగరంలో తమకు 7వ డీలర్‌షిప్ అన్నారు. ఇక్కడ జావా, యెజ్డి, బిఎస్‌ఎ మోటర్‌సైకిల్స్ లభిస్తాయన్నారు.

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: రాజమహేంద్రవరం
O.S. No.387 / 2020
Between:
వానపల్లి సత్య దుర్గాప్రసాద్ వగైరాలు ...వాదులు
మరియు
1) వానపల్లి శ్రీనివాసరావు
2) గనిశెట్టి అమ్మాజీ
3) పొన్నగంటి పాపాయ్యమ్మ
4) గనిశెట్టి V.V.K.N.H.కుమార్ ...ప్రతివాదులు
To: D4:: గనిశెట్టి V.V.K.N.H.కుమార్
S/o. వీరవెంకట సూర్యనారాయణ,
వయస్సు 38 సం॥లు, ఉద్యోగం
ప్రస్తుత చిరునామా: డో.నెం.1-40/సి,
శంకర్‌నగర్ కాలనీ, రోడ్ నెం.3, అశోక్‌నగర్,
శేర్‌లింగంపల్లి, హైదరాబాద్- 502307,
తెలంగాణ
శాశ్వత చిరునామా: డో.నెం.17-112,
శాలిపేట, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా,
ఆంధ్రప్రదేశ్ - 534 281

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది ఉన్న రెండు చిరునామాలకు ఎన్నిసార్లు దావా సమను నోటీసులు పంపినను అందుకొనక Evade చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ది.22-04-2025 సం॥రం ఉదయం గం॥10.30 ని॥లకు మీరు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై సంజాయిషీ యివ్వనియెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమునందు తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

భమిడిపాటి వెంకటరామ శర్మ
అడ్వకేటు, కాకినాడ, సెల్: 9246589838
కె.వి.సూర్యనారాయణ
అడ్వకేటు, రాజమహేంద్రవరం
సెల్: 9441475573
కాకినాడ
ది.08-04-2025

ప్యారానగర్ డంపింగ్ యార్డ్ మాకొద్దు

- పనులు ప్రారంభించిన రెండు నెలల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణా?
- నల్లవల్లి గ్రామ పంచాయతీకి నోటీసు.. ప్రారంభమైన ప్రజాభిప్రాయం
- మొదటి రోజు వ్యతిరేకించిన నాలుగు గ్రామాల ప్రజలు
- కోర్టు స్టే ఉండడంతో ఆగిన పనులు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్-నల్లవల్లి గ్రామంలో జిహెచ్‌ఎంసి, రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డ్ వద్దంటూ స్థానికులు వ్యతిరేకించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం రెండు నెలల క్రితమే రాంకీ సంస్థ పనులు చేపట్టింది. స్థానికులు దాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపట్టారు. భూముల సర్వే చేయకుండానే డంపింగ్ యార్డ్ పనులు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ రైతులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ నెల 18 వరకు ఎలాంటి పనులు కొనసాగించవద్దంటూ స్టే విధించింది. పనులు తాత్కాలికంగా ఆగిపోయినా డంపింగ్ యార్డ్ పెట్టాలన్న ఆలోచనలో రాంకీ సంస్థ ఉండడంతో 11 గ్రామాలకు చెందిన ప్రజలు జెఏసిగా ఏర్పడి 66 రోజులుగా స్థానికంగా గ్రామాల వారీగా నిరవధిక దీక్షలు కొనసాగిస్తున్నారు. అనేక రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసు..

కోర్టు స్టే ఉండడంతో డంపింగ్ యార్డ్ పనులను తాత్కాలికంగా నిలిపి వేశారు. ప్రజాందోళన కొనసాగుతున్న వేళ ఈ నెల 3న గుమ్మడిదల తహశీల్దార్ పరమేశం ఎ1-నోటిఫికేషన్ జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాలిడ్ వ్యర్థాల నిర్వహణ కోసం గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లోని బిలా దాఖల్ సర్వే నెంబర్‌లో ఉన్న 152 ఎకరాల భూమిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడానికి సిఫార్సు చేశారు. నోటీసు జారీ చేసిన రోజు నుంచి 15 రోజుల్లోపు స్థానిక ప్రజలు డంపింగ్ యార్డ్ గురించి ఆసక్తి, వ్యతిరేకత చూపే వాళ్లు తమ అభిప్రాయాన్ని తెలియజేయాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. తహశీల్దార్ జారీ చేసిన నోటీస్ గురించి మండల వాసులంతా తెలుసుకుని డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ అభిప్రాయం తెలియజేయాలని తీర్మానించుకున్నారు. జెఏసి ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చింది. దాంతో శుక్రవారం మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, మంబాపూర్‌కు చెందిన 1000 మంది వరకు తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయవద్దంటూ అభిప్రాయం తెలియజేస్తూ తహసీల్దార్ కార్యాయంలో సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతులు అందజేశారు.

పనులు ప్రారంభించిన తర్వాత ప్రజాభిప్రాయమా..?

డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ముందే ప్రజాభిప్రాయం చేయాల్సి ఉన్నా జిహెచ్‌ఎంసి, రాంకీ సంస్థ, రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న పరిస్థితి ఉంది. పనులు మొదలు పెట్టిన రెండు నెలల తర్వాత ప్రజాభిప్రాయం ఎలా సేకరిస్తారని జేఏసీ నాయకులు ఆర్డీఓను శుక్రవారం నిలదీశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎఎస్పీ సంజీవరావు నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పోలీసులు మోహరించారు.

18 వరకు స్టే ఉన్నది: రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి, ఆర్‌డిఒ

ప్యారానగర్ భూముల సర్వేకు సంబంధించి హైకోర్టు స్టే విధించడం వల్ల అక్కడ పనులు జరగట్లేదు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనున్నందున ఆసక్తి ఉన్న వాళ్లు, వ్యతిరేకించే వాళ్లు తమ అభిప్రాయాల్ని తెలియజేసేందుకు వీలుగా ప్రజాభిప్రాయాన్ని కోరాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.



దేశ సేవలో తెలుగువారికి గుర్తింపు రాలేదు

- మండలి బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి - కల్చరల్

వంశీ ఇంటర్నేషనల్ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై భిన్న రంగాలకు చెందిన పన్నెండు దేశాల నుంచి హాజరైన ప్రతిభావంతులకు ఉగాది అవార్డ్స్ ప్రధానోత్సవం శనివారం వేడుకగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎపి శాసన సభ సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగువారు తమ వారి గొప్పతనం గుర్తించరని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో త్యాగాలు చేసిన వారు ఎక్కువగా తెలుగువారేనని తెలిపారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యను స్మరించుకునే వారే నేడు లేరని అవేదన వ్యక్తం చేశారు. వంశీ సంస్థ విదేశాలలో ఉన్న వివిధ రంగాల ప్రముఖులు 53 మందిని సత్కరించి తెలుగు జాతి ప్రతిష్ట చాటారని పేర్కొన్నారు. విఖ్యాత వైద్యుడు డాక్టర్ కాకర్ల సుబ్బారావు పేరిట కిమ్స్ డైరెక్టర్ బొల్లినేని కృష్ణయ్య ఏర్పరచిన అవార్డును ప్రఖ్యాత న్యూరాలజిస్ట్ డాక్టర్ మోహన్ దాసుకు స్వర్ణ పతకంతోనూ, పింగళి వెంకయ్య అవార్డును పూర్వ ప్రధాని పి.వి సోదరుడు మనోహరరావుకు, నటుడు చంద్రమోహన్ అవార్డును నటి కవితతోపాటు ఇతర దేశాల తెలుగు ప్రముఖులకు బహూకరించారు. డాక్టర్ మోహన్‌దాస్ తమ స్పందన తెలుపుతూ నిమ్స్ అభివృద్ధిలో కాకర్ల సుబ్బారావు విజన్ మరువలేమన్నారు. వైద్య రంగంలో అయన చేసిన కృషి విశేషమని కొనియాడారు. అయన పేరిట అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. వేదికపై తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు, దర్శకుడు రేలంగి నరసింహారావు, బొల్లినేని కృష్ణయ్య తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు కార్యక్రమం నిర్వహించారు. రాధిక మంగినపూడి వ్యాఖ్యానం చేసిన కార్యక్రమంలో డాక్టర్ తెన్నేటి సుధ, శైలజ తదితరులు పర్యవేక్షణ చేశారు.

IN THE COURT OF THE HON'BLE X METROPOLITAN MAGISTRATE, MANORANJAN COMPLEX, AT :: HYDERABAD
Crl.M.P. No: 191 of 2025
IN
C.C.NO: 2257 OF 2021
BETWEEN:
Sri G.Ganesh Rao ...COMPLAINANT
And
1.M/S Bharath Greeninfracon (INDIA) Limited Rep by its Managing Director, Maddipatla Sreenivas & another ...ACCUSED
PROCLAMATION REQUIRING THE APPEARANCE OF A PERSON ACCUSED
(under section 82, Criminal Procedure Code)
Whereas the complaint has been made before Hon'ble X Metropolitan Magistrate, Manoranjan Complex, At: Hyderabad that (1). M/S Bharath Greeninfracon (INDIA) Limited, Rep by its Managing Director, Maddipatla Sreenivas, Sio. M. Venkata Rao, Registered office at #2-87/1, 1" Floor, Sai Nagar, Chaitanyapuri, Dilsuknagar, Hyderabad-060 and (2) Maddipatla Sreenivas, Sto. M. Venkain Rao, Managing Director & Authorised Signatory M/S Bharath Greeninfracon (INDIA) Limited, Aged about 56 years Occ: Business, Rio Flat No.:405, 4th Floor, Vijayshri Towers, 6th Phase, KPHB. Colony, lyderabad, has committed the offence of U/s. 138 of NI Act, punishable under the said section and it has been returned to a warrant of arrest thereupon issued that the said Maddipatla Sreenivas, S/o. M. Venkata Rao cannot be found and whereas it has been shown to the satisfaction of the court that the said Maddipatla Sreenivas, S/o. M. Venkata Rao, as absconded (or is concealing himself to avoid the execution of the said Warrant).
Proclamation is hereby made that the above said accused i.e Maddipatla Sreenivas, S/o. M. Venkata Rao, is required to appear at 10.30 A.M., before the Hon'ble X Metropolitan Magistrate, Manoranjan Complex, At: Hyderabad to answer the said complaint on the 01" day of May, 2025
//By order of the Court//
Sd/- X Metropolitan Magistrate, Manoranjan Complex, At: Hyderabad
(CH. SHYAM RAO)
Advocate
Office at Flat NO: 201, 2nd floor, Premises No. 6-1-121 Padma Rao Nagar, Secunderabad-500 025 Cell:9246533237

ఆహారోత్పత్తుల రంగంలో రూ.16 వేల కోట్ల పెట్టుబడులు

- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఆహారోత్పత్తుల రంగంలో రూ.15,919 కోట్ల పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జూన్ 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న "ఫుడ్ ఏ ఫెయిర్" రెండో ఎడిషన్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 7,150 ఎకరాల విస్తీర్ణంలో 14 ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 6,800కు పైగా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలకు అత్యుత్తమ సాంకేతికత, ప్రపంచ శిక్షణ, పరిజ్ఞానం, విస్తృత మార్కెట్ సహాయ సహకారాలు అందించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇన్నోవేషన్, ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ క్లూజి విటీ మేళవింపుతో అభివృద్ధికి ఊతమిచ్చే వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆహారం, వ్యవసాయం, ప్రాసెసింగ్ రంగాల్లో తెలంగాణను జాతీయ అగ్రగామిగా నిలబెట్టడానికి తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ.కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, "ఫుడ్ ఏ ఫెయిర్" నిర్వాహకులు శ్రీకాంత్, టీజీ శ్రీకాంత్, విశాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ విరోధి బిఆర్ఎస్

రాష్ట్ర సంక్షేమానికి బిఆర్ఎస్ పెద్ద విరోధిగా మారిందని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. అబద్ధపు ప్రచారంతో ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు మాజీ మంత్రి కెటిఆర్ కంకణం కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడో తొమ్మిదేళ్ల క్రితం రాజస్థాన్‌లో చనిపోయిన జింక పిల్లను చూపించి హెచ్‌సియులో చనిపోయినట్టు బిఆర్ఎస్ క్రియేట్ చేసిందని చెప్పారు. అక్కడ ఏనుగులు సంచరిస్తున్నట్టు ఎఐ ద్వారా చూపించి ప్రజల్లో అనుమానాలను రేకెత్తించారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్నీ విషయాల్లో బాధ్యతాయుతంగా పని చేసేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రకృతి కాలుష్యాన్ని తరిమి కొట్టేందుకు మూసీ ప్రక్షాళన చేపట్టబోతున్నట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఇలాంటి వాస్తవాలన్నింటినీ మరుగుపరిచి బిఆర్ఎస్ సోషల్ మీడియాను ఉపయోగించుకుని తమ ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. రూ.5200 కోట్ల భూమిని రూ.30వేల కోట్లకు చూపించారంటూ కేటీఆర్ అనడ మేంటని ప్రశ్నించారు. సెక్యూరిటీ బ్యూరో ఆఫ్ ఇండియా అనే రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా చేసిన సర్వే ప్రకారం రూ.23వేల కోట్ల విలువ వచ్చిందని గుర్తు చేశారు. దాన్ని సెబి, ఆర్‌బిఐ కూడా నిర్ధారణ చేశాయన్నారు. ఐసిఐసిఐ కూడా రుణం ఇవ్వలేదని తెలిపారు. టీజీఐఐసీ మార్కెట్ ఫోర్ సెస్ ద్వారా 37 అంతర్జాతీయ సంస్థల నుంచి మ్యూచవల్ పెట్టుబడులు బాండ్ల ద్వారా ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. తక్కువ వడ్డీతో ప్రభుత్వ సంక్షేమం కోసం నిధులు సేకరించిందని వివరించారు. బాండ్ల రూపంలో (5.12.2024) రూ.9,995 కోట్ల నిధులను సేకరించిందని గుర్తు చేశారు. ఎస్ఈబీఐలో రిజిస్టర్ అయిన మర్చంట్ బ్యాంకర్‌ను టిజిఐఐసి నియమించుకుందని చెప్పారు. ట్రస్ట్ ఇన్వెస్ట్ ఇండస్ట్రీ సంస్థ ఇతర రాష్ట్రాలకు నిధులు సమకూర్చిందని తెలిపారు. రైతుల సంక్షేమం, రైతు భరోసా, రుణమాఫీకి ఆ నిధులను ఉపయోగించామని వివరించారు. సన్న బియ్యం కోసం రూ.947కోట్లు ప్రభుత్వం ఉపయోగించిందని తెలిపారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ విషంకక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సంపూర్ణ శతావధానం ఆరంభం అపూర్వం

ప్రజాశక్తి - కల్చరల్

చాలా కాలం తర్వాత తెలుగు భాషా అభిమానులు ప్రేమించే తెలుగు పద్యాల తోరణం శతావధాన ప్రక్రియ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టిఆర్ కళా మందిరంలో శనివారం అవధాన విద్య వికాస్ పరిషత్ , ప్రజా పద్యం సంస్థ తెలుగు విశ్వవిద్యాలయ సహకారంతో అపూర్వంగా ఆరంభమైంది. అవధాని డాక్టర్ మారెపల్లి వెంకట రమణ పట్వర్ధన్ మూడు రోజుల పాటు సంపూర్ణ శతావధానం విన్యాసంలో తొలి రోజు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానంద రావు మాట్లాడుతూ, తెలుగు వారి సంపద పద్యం కాగా అవధాన ప్రక్రియ పద్యాల తోరణం అన్నారు. అవధానంలో అవధాని అశువుగా చెప్పే పద్యాలు కొన్ని తదుపరి కాలంలో సూక్తులుగా నిలిచి వుంటాయని పేర్కొన్నారు. శాసన మండలి సభ్యులు సురభి వాణి, సీనియర్ జర్నలిస్ట్ వనం జ్వాలా నరసింహారావు, దర్శనం పత్రిక సంపాదకుడు మరుమాముల వెంకట రమణ శర్మ, గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తదితరులు సమక్షంలో పెరంబూరు శ్రీ రంగాచార్య అభినందన ప్రసంగంతో అవధాని పట్వర్ధన్ ప్రృచ్ఛకుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ అవధానం ఆరంభించారు. నిర్వాహకులు దత్తాత్రేయ శర్మ నారుమంచి వెంకట కృష్ణ కార్యక్రమం పర్యవేక్షణ చేశారు.

కార్మికవర్గ రాజ్యాధికారమే లక్ష్యం

- శ్రామికుల ఐక్యతను దెబ్బతీయడమే పెట్టుబడిదారుల కుట్ర
- కులాల మధ్య ఆధిపత్య పోరాటం దానిలో భాగమే
- సిఐటియు సామాజిక న్యాయసాధన క్యాంపెయిన్ రాష్ట్ర సదస్సులో వీరయ్య

సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భారతదేశంలో కార్మికవర్గ రాజ్యాధికారం ఏర్పడితే, తక్షణం అధికారాన్ని కోల్పోయేది అదానీ, అంబానీలతోపాటు బూర్జువా రాజకీయపార్టీలే అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య తెలిపారు. కార్మికవర్గానికి మార్క్సిజం అర్థమయ్యేలా చెప్పగలిగితే రాజ్యాధికారం తప్పకుండా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీన్ని విచ్ఛిన్నం చేయడానికి పెట్టుబడిదారీ వర్గాలు శ్రామికులను కులం, మతం పేరుతో బహుజనులుగా విభజించి, అధికారంలో కొనసాగుతున్నాయని విశ్లేషించారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ నిర్వహిస్తున్న సామాజిక న్యాయసాధన క్యాంపెయిన్ సందర్భంగా శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సమకాలీన పరిస్థితుల్లో రాజ్యాంగం-అంబేద్కర్-కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. బహుజన రాజ్యాధికార నినాదం వినడానికి బాగున్నా, దాని లక్ష్యం కులాల మధ్య ఆధిపత్య పోరాటమేననీ, కులగణన నినాదాన్ని బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు చేస్తున్నాయని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పంచుకోవాలని చెప్తున్నాయే తప్ప, అందరికీ ఉద్యోగాలు, ఉపాధి అనే మౌలిక విధానాన్ని విస్మరిస్తున్నాయని చెప్పారు. కేవలం కమ్యూనిస్టులు మాత్రమే ఈ డిమాండ్ చేస్తున్నారనీ, దాన్ని పాలక వర్గాలు వ్యతిరేకిస్తున్నాయని వివరించారు. కమ్యూనిస్టులను కూడా కుల, మత జాడ్యాలు వెంటాడుతున్నాయనీ, వాటి ఉచ్చులో పడితే మార్క్సిజం అర్థం కానట్టేనని విశ్లేషించారు. కార్మికవర్గ సిద్ధాంతాన్ని బలహీనపరిచే కుట్రలో భాగంగానే బహుజనరాజ్యం నినాదాన్ని ముందుకు తెస్తున్నారని చెప్పారు. శ్రామికులు ఐక్యమైతే పెట్టుబడిదారీ వ్యవస్థ అంతమవుతుందనీ, అది జరక్కుండా జాగ్రత్త పడేందుకు సమాజాన్ని విభజించి, పాలిస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు కులం అవసరం లేదనీ, కేవలం శ్రమైకజీవుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడం కోసం 'కులం' అవసరాన్ని ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. కులం ఉన్నంతకాలం వివక్ష ఉంటుందనీ, దాన్ని కొనసాగించడం కోసమే అస్తిత్వవాద ఉద్యమాలను పెట్టుబడిదారులు ప్రోత్సహిస్తున్నారని పలు ఉదాహరణలు వివరించారు. పాలకవర్గాల భావజాలం సమాజంలో విస్తరించి ఉన్నదనీ, దాన్ని తట్టుకోవడం కష్టమనీ, కానీ కమ్యూనిస్టులుగా దాన్నే మనం సాధించాల్సి ఉందని దిశానిర్దేశం చేశారు. అంతకుముందు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన కామ్రేడ్ బిటి రణదివే వర్ధంతి, కామ్రేడ్ విమల రణదివే జయంతి, జోతిరావుపూలే జయంతి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ వర్గపోరాటాలను ఉధృతం చేయడం కోసం కేలండర్‌ను ప్రకటించినట్టు చెప్పారు. కార్మికవర్గాన్ని ఐక్యం చేసి, పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయడమే సిఐటియు లక్ష్యమని తెలిపారు.

దీనికి కులం, మతం, భాష వంటి అనేక అవరోధాలు ఉన్నాయనీ, వీటిని పెట్టుబడిదారులే పెంచి పోషిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అంబేద్కర్‌ను ఆకాశానికెత్తుతూనే, ఆయన లక్ష్యాలకు మాత్రం తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని అమల్లోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, దాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ కొద్దిమందికే ప్రయోజనాలు కల్పిస్తుందని చెప్పారు. కార్మికవర్గ దీర్ఘకాల ప్రయోజనాల కోసం భవిష్యత్‌లో మరిన్ని ఐక్య పోరాటాల అవసరం ఉందన్నారు. సదస్సులో సిఐటియు ఉపాధ్యక్షులు వివిఎస్ రావు, కార్యదర్శులు జె వెంకటేష్, ఆర్ రమేష్, కె మాధవి, జె చంద్రశేఖర్, ఎమ్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ కాటంరాజు, రామ్మోహన్, పి సుధాకర్, ఎ సునీత, ఎస్-ఎస్ఆర్ఎ ప్రసాద్, శ్రవణ్‌కుమార్, మీనా, పి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ వందన సమర్పణ చేశారు.

నష్టపోయిన పంటలకు పరిహారమివ్వాలి

- రైతుబంధును ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- పంట పొలాలను సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

వరి పంటను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడగండ్ల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి, ఉచితంగా విత్తనాలు అందజేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం రాజగోపాల్‌పేట గ్రామంలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలోనే పది వేల ఎకరాల పంట నష్టం జరిగిందని అన్నారు. నంగునూరు మండలంలో 11 గ్రామాల్లో దాదాపు 5,300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు గుర్తించారని తెలిపారు. వానాకాలం రూ.9 వేల కోట్లు, ఈ యాసంగిలో రూ.5 వేల కోట్లు మొత్తం రూ.14 వేల కోట్ల రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిందని ఆరోపించారు. పంట బీమాకు సంబంధించిన బడ్జెట్‌లో డబ్బులు పెట్టినా ఒక్క రైతుకు కూడా ఇవ్వలేదన్నారు. పోయిన ఎండాకాలం సిద్దిపేటలో 1,350 ఎకరాల్లో వడగండ్ల వానకు పంట నష్టం జరిగిందని, ఇప్పటివరకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పంటల బీమా తెస్తాం.. రైతుబంధు రూ.15,000 ఇస్తాం..రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారని, కానీ వానాకాలం రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. కెసిఆర్ ఉన్నప్పుడు అందరికీ రైతుబంధు డబ్బులు పడ్డాయన్నారు. ఈ ప్రభుత్వం కోతలు పెట్టాలని మొత్తం సర్వే నెంబర్లలో అర్ధెకరం, పావు ఎకరం ఎక్కువ ఉందనే సాకుతో రైతుబంధు ఆపిందని చెప్పారు. రూ.9 వేల కోట్లు రైతుబంధు ఇవ్వాల్సి ఉంటే రూ.నాలుగు వేల కోట్లు మాత్రమే ఇచ్చామంటున్నారని, అయితే, ఇంకా రూ.ఐదు వేల కోట్లు కోత పెట్టారని చెప్పారు. రైతు బీమా విషయంలో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, చాలామంది చనిపోయిన రైతులకు సంబంధించి ఆ కుటుంబాలకు రైతు బీమా అందడం లేదన్నారు. ఏ ఏ గ్రామాల్లో ఎక్కువగా పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మాజీ ఎంపిపి సభ్యులు జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, పిఎసిఎస్ చైర్మన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ.. హక్కులను కాలరాయడమే

- ఆప్ ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వక్ఫ్ చట్ట సవరణ చేయడమంటే కేంద్ర ప్రభుత్వం ముస్లిముల హక్కుల కాలరాయడమేనని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి అణగారిన తరగతులకు రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఇది భారత లౌకిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా మతాలు, కులాల పేరిట దేశాన్ని విభజించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసినట్టు, న్యాయం జరుగుతుందని పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ.. ముస్లిములకు సంబంధించిన వక్ఫ్ చట్టంలో సవరణ పేరుతో కేంద్రం తల దూర్చడం సరైంది కాదన్నారు. భవిష్యత్‌లో ఇతర మత సంస్థలకు సంబంధించి అంశాల్లోనూ కలుగజేసుకునే ప్రమాదం ఉందన్నారు. టిపిసిసి ఉపాధ్యక్షులు ఎంఆర్.జి.వినోద్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ఎంఐఎం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ సయ్యద్ జాఫ్రీ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం ద్వారా పట్టణ ప్రాంతాల్లో విలువైన భూములను కొట్టేసేందుకు కుట్రలు జరిగే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో టిజెఎస్ నగర ఉపాధ్యక్షులు అఫ్జల్, ఆప్ నేతలు సుధారాణి, విజయ్ మల్లంగి, జావిద్ షరీఫ్, షాబాజ్, నాగరాజు, అజీమ్ బేగ్, అజ్మత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ లాయర్లను అనుమతించొద్దు

- న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు ఆమోదయోగ్యం కాదు
- ఐలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, పార్థసారథి

ముసాయిదా బిల్లు ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలతో కూడిన బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొత్తగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన న్యాయవాదుల (సవరణ చట్టం)బిల్లు-2025ను వ్యతిరేకిస్తున్నట్టు ఆలిండియా లాయర్స్ యూనియన్(ఎఐఎల్‌యు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఏకపక్ష సవరణ మూలంగా వృత్తితోపాటు న్యాయవాదుల మనుగడకే ప్రమాదమని వాఖ్యానించింది. విదేశీ న్యాయవాదులను దేశంలో ప్రాక్టీస్ చేసేందుకు అనుమతించరాదని సూచించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వికె)లో ఐలు రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.పార్థసారధి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ముసాయిదా బిల్లు ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలతో కూడిన బుక్‌లెట్‌ను మీడియాకు విడుదల చేశారు. అలాగే కొత్త ముసాయిదా బిల్లులోని లోపాలు, కేంద్ర ప్రభుత్వం ఏకపక్షవైఖరిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త సవరణ ముసాయిదా బిల్లులో న్యాయవాదుల రక్షణ, సంక్షేమ చర్యల గురించి ఏమీ లేకపోగా, వృత్తిని ప్రమాదంలో పడేసే ప్రతిపాదనలు ఉన్నాయని తప్పుబట్టారు. 1961లో రూపొందించిన న్యాయవాదుల చట్టాన్నే యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మార్పులు, చేర్పులు చేయాలనుకుంటే న్యాయవాదులు, న్యాయనిపుణులతో సంప్రదింపులు చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఎలాంటి చర్చలు లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం న్యాయవాద చట్టాన్ని సవరించాలని చూస్తే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కేవలం న్యాయవిద్య చదువుకున్న వారే న్యాయవాద వృత్తిలోకి రావడంతోపాటు బార్‌కౌన్సిళ్లకు ప్రాతినిథ్యం వహించాలని అభిప్రాయపడ్డారు. ఆయా రాష్ట్రాల బార్‌కౌన్సిళ్లుగానీ, బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియాలోకి కేంద్ర ప్రభుత్వం ముగ్గురు న్యాయవాదేతర వ్యక్తులను నియమించాలని చూడటం అప్రజాస్వామ్య విధానమని విమర్శించారు. కొత్త సవరణ చట్టం న్యాయవాదుల ఉనికిని దెబ్బతీసేవిధంగా ఉందని గుర్తు చేశారు. కొత్త ప్రతిపాదిత ముసాయిదాలో తెలంగాణ అనే పేరే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకిక భారతదేశంలో న్యాయవాదులతో సంప్రదించకుండా కొత్త చట్టం తేలేరని స్పష్టం చేశారు. ప్రజలు, న్యాయవాదుల తరపున ఉద్యమాలు,పోరాటాలు చేయకుండా అడ్డుకోవడానికే కొత్త చట్టం ద్వారా నియంత్రించాలని కేంద్రం చూస్తున్నదని విమర్శించారు. ఈ సమావేశంలో ఐలు నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మామిడి వెంకట్‌రెడ్డి, మందడం శ్రీనివాసరావు, మాధవరెడ్డి, వెంకటేష్, శర్మ, వేణుగోపాల్, రమేష్‌కుమార్ మక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 వేలు పరిహారమివ్వాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలు, వడగండ్ల వాన వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20వేల పరిహారమివ్వాలని తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ డిమాండ్ చేశారు. వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.40 వేల పరిహారం చెల్లించాలని కోరారు. శనివారం ఈమేరకు ఇదే అంశంపై వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మొక్కజొన్న, వరి, మామిడి, కొబ్బరి, బొప్పాయి, కూరగాయలు, చెరుకు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. పిడుగులు పడి గొర్రెలు, మేకలు, పశువులు కూడా మరణించాయని తెలిపారు. వానాకాలంలో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. ఎకరాకు రూ.10వేల పరిహారమిస్తామన్న ప్రభుత్వం 1.5 లక్షల ఎకరాలకు రూ. 15.80 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. యాసంగిలో కూడా భద్రాద్రికొత్తగూడెం, ములుగు, ఉమ్మడి మహబూబ్‌నగర్, అదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో పంటలకు తీవ్రనష్టం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ పంటల బీమా పథకాన్ని ప్రారంభించలేదని పేర్కొన్నారు. పిఎమ్ ఫసల్ బీమా పథకంలో చేరినప్పటికీ ప్రీమియం చెల్లించక పోవడంతో రైతులకు పరిహారం రావడం లేదని తెలిపారు. అందువల్ల యాసంగిలో జరిగిన పంట నష్టాల వివరాలకు సేకరించి, పూర్తి పరిహారాన్ని రైతులకు చెల్లించాలని కోరారు. రానున్న రోజుల్లో వర్షాలు పడే పరిస్థితి ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటించిందనీ, రైతులకు సలహాలు, సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ వరకూ 'తెలుగు' తప్పనిసరి

- లెక్చరర్ల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియెట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల సంఘం (టిగ్లా) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నయీం పాషా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సంస్కృతం చదువుతున్న/ఆసక్తి ఉన్న విద్యార్థుల వివరాల గురించి, సంస్కృత పోస్టుల ఆవశ్యకత గురించి తెలపాలంటూ కాలేజీల ప్రిన్సిపళ్లు, డిఐఇఒలను ఆర్‌జెడి కోరుతూ సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. ఇలా వివరాలు అడగడం వల్ల తెలుగు బోధన అధ్యాపకులు, భాషాభిమానులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కేవలం మార్కుల కోసమే ప్రయివేటు జూనియర్ కాలేజీలు సంస్కృతాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు నిజ జీవితంలో ఆ భాష వల్ల ఎలాంటి ఉపయోగం లేదని వివరించారు. ఎక్కడా ఉపయోగపడని భాషను విద్యార్థులపై ఎలా రుద్దుతారని ప్రశ్నించారు. ద్వితీయ భాషగా సంస్కృతం ప్రవేశపెడితే తెలుగు భాషపై సామర్థ్యం మరుగున పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కాలేజీల్లో ద్వితీయ భాషగా సంస్కృతం ప్రవేశపెట్టే ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్ వరకు తెలుగును తప్పనిసరి చేసి మాతృభాషకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటర్‌లో సంస్కృతం ప్రవేశపెట్టడం సమంజసం కాదు : టిజిఎల్ఎ

రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు లేని సంస్కృత భాషను ఇంటర్మీడియట్‌లో ప్రవేశపెట్టడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్ఏ) విమర్శించింది. దేశంలో మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో రాష్ట్రంలో సంస్కృత భాషను ప్రవేశపెట్టాలనే నిర్ణయం తీసుకోవడం విచారకరమని తెలిపింది. ఇంటర్‌లో ద్వితీయ భాషగా సంస్కృతం సబ్జెక్టును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం హైదరాబాద్‌లో ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్యను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కనకచంద్రం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ద్వితీయ భాష సంస్కృతం సబ్జెక్టు ప్రవేశపెట్టాలని ఆర్‌జెడి ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసి దీనిపై పున్ణసమీక్షించాలని కోరారు.

సూపర్ సిఎంగా మీనాక్షి నటరాజన్

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెవి వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు రాజకీయాల పట్ల కనీస అవగాహన లేదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో తమ సిఎంలు తప్పు చేస్తే పిసిసి అధ్యక్షులు దారిలో పెట్టేవారనీ, అందుకు భిన్నంగా ఇప్పుడు మహేష్ మాత్రం డమ్మీ పిసిసి చీఫ్‌గా మారారని ఎద్దేవా చేశారు. కెటిఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అవాస్తవాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. హెచ్‌సియు భూముల వ్యవహారంపై సిఎం రేవంత్‌తో కలిసొస్తే తాము ఆ పార్టీతో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. కెటిఆర్‌పై విచారణ జరపాలని గతంలో కాంగ్రెస్ నేతలు పలు కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశారనీ, తప్పు చేసింది వాస్తవమే అయితే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో తాము లేవనెత్తిన అనేక అంశాలపై సమాధానం చెప్పలేక ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూపర్ సిఎంగా అవతరించారని ఎద్దేవా చేశారు. ఇది రాజ్యాంగ సంస్థలను అవమానించడమే అవుతుందని అన్నారు. కంచ గచ్చిబౌలి భూములను కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుకూల పెట్టుబడిదారులకు కారు చౌకగా అమ్మేందుకు సిఎం రేవంత్ సర్కార్ యత్నిస్తోందని విమర్శించారు. హెచ్‌సియు భూముల వెనుక ఉన్న బిజెపి ఎంపి పేరును త్వరలో బయట పడుతామని స్పష్టం చేశారు. మీడియా సమవేశంలో బిఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, కె.కిషోర్‌గౌడ్, తుంగబాలు పాల్గొన్నారు

సిఎంకు రక్షణ కవచంలా బిజెపి ఎంపిలు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రంలోని రెండు జాతీయ పార్టీల్లో ఒకరు ఢిల్లీకి సంచులు మోస్తే.. మరొకరు చెప్పులు మోస్తున్నారు. హెచ్‌సియు భూముల వ్యవహారంలో బిజెపి ఎంపికి ఫ్యూచర్ సిటీలో లబ్ధిచేకూర్చే ప్రయత్నం సాగుతోంది. రాష్ట్ర సర్కారు అవినీతిపై కేంద్రానికి మేము ఫిర్యాదులిస్తే ఇక్కడి బిజెపి ఎంపిలు ముఖ్యమంత్రికి రక్షణ కవచల్లా వ్యవహరిస్తున్నారు' అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారకరామారావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడారు. బిఆర్ఎస్ రజతోత్సవ సంబురాల ఏర్పాట్లను వివరించారు. హెచ్‌సియు భూముల తనఖా విషయంలో కాంగ్రెస్ నేతలకు స్పష్టత లేదని ఆరోపించారు. 'పిసిసి చీఫ్ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నామని ఒప్పుకున్నారు.. కానీ మంత్రి శ్రీధర్‌బాబు రుణం తీసుకోలేదని అంటున్నారు. ఇది వారి వైరుధ్యాన్ని తెలియజేస్తుంది' అని అన్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద మోసమని, ఇతరుల భూమిని తనఖా పెట్టడం మోసం కాదా? అని ప్రశ్నించారు. బిజెపికి చెందిన ఓ ఎంపి బ్రోకర్‌ను తెచ్చారని, ఆ బ్రోకర్‌కు 1.7శాతం కమీషన్ ఇచ్చారని అన్నారు. 'పన్నేతర ఆదాయం కోసం ప్రభుత్వాలు భూములు అమ్మక తప్పదు. మేం కూడా భూములు అమ్మాం.' అని కెటిఆర్ చెప్పారు. అయితే, హెచ్‌సియు భూముల తనఖా విషయంలో కాంగ్రెస్ చేస్తున్నది మోసమని ఆరోపించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ సంస్థల ద్వారానే భూములు అమ్మామని, కాంగ్రెస్ సర్కారు బ్రోకర్లకు లంచాలు ఇచ్చి అమ్ముతోందని విమర్శించారు. 'హెచ్‌సియు భూమిని కొన్న వారికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్, బిజెపి కలిసి దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒక్క పిల్లర్‌కు గీత పడితే మొత్తం కాళేశ్వరం కూలిపోయినట్టు కెసిఆర్‌పై గుడ్డి వ్యతిరేకతతో ప్రచారం చేశారు. కానీ కాళేశ్వరంతో అద్భుతమైన పంటలు పండాయి' అని గుర్తు చేశారు. కెసిఆర్‌పై ద్వేషంతో మేడిగడ్డ గేట్లను ఎత్తి ఆంధ్రప్రదేశ్‌కు నీళు వదిలేస్తున్నారని, ఈ ఎండాకాలంలో మేడిగడ్డకు రిపేర్లు చేసి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు.

రజతోత్సవ సభ అనుమతి కోసం కోర్టుకెళ్లాం

బిఆర్ఎస్ రజతోత్సవ సంబురాలను ఎల్కతుర్తిలో ఘనంగా నిర్వహిస్తామని, లక్షలాది మంది వచ్చేందుకు సిద్ధం అవుతున్నారని కెటిఆర్ అన్నారు. 'సభ కోసం వెయ్యి ఎకరాల ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. 'పోలీసు అనుమతి ఇవ్వకపోతే కోర్టుకు వెళ్లా.ఇది మీ ప్రభుత్వంపై యుద్ధ భేరి కాదు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడే బిఆర్ఎస్ బలాన్ని చూపిస్తాం' అని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో కరీంనగర్, హుజూరాబాద్, కోరుట్ల ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడికౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్ సహా ఉమ్మడి జిల్లాలోని 13నియోజవకర్గాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధమని ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తనకేమి పట్టనట్టు వ్యవహరిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు మనుషులను చంపే అధికారం లేదని అన్నారు. ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం మాత్రమే శిక్షించాలనీ, కేంద్ర బలగాల ద్వారా మావోయిస్టులను వెంటాడి చంపడం సరైన విధానం కాదన్నారు. మావోయిస్టులతో చర్చలకు తక్షణమే తగిన వాతావరణ కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేలసి మత ప్రాదిపదికన విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు.